## వస్తువుల బులుపు

వాది ఆడది. ఆమెకున్న రెండు పాతవస్తువులు చెఱిపించు కొని కొత్తవస్తువులు చేయించుకోవాలని బుద్ధిపుట్టింది. అందుకుగాను తన యింటికంటె ప్రతివాదియిల్లు విశాలమైనదని, ప్రతివాది యింట్లో పనిచేస్తూవున్న బంగారపు పనివాళ్ళచేత అక్కడ చేయించుకోవాలని ఏర్పాటు చేసుకుంది.

తనతాలూకు రెండు పాతవస్తువులు కరిగించి కొత్త వస్తువులు కావడానికి ప్రతివాదికి తన పాతవస్తువులు ఇచ్చింది. ప్రతివాది ఆపాతవస్తువులు రెండూ కరిగింపించి వచ్చిన బంగారం వాదికిచ్చేశాడు. తిరిగి వాది ఆ బంగారం ప్రతివాది కిచ్చినట్టు కనబడదు.

కాని వొకటి కనిపిస్తుంది. ఆమె ప్రతీరోజూ ప్రతివాది యింట్లో వున్న పనివాండ్లచేత తాను స్వయముగా దగ్గరుండి పనిచేయించుకుని, వాళ్ళపని అవడంతోనే సాయంకాలం ఆ సగం సగం చేయబడ్డ తన కొత్తవస్తువులు ఆమె తీసికొని, ఆమెకు ప్రతివాది యిచ్చిన ఒకపెట్టెలో జాగ్రత్తచేసుకొని, ఆ పెట్టె ప్రతివాదియింట్లోనే ఒకగదిలో ఉంచుకొని, గదికి తాళంవేసికొని, ఆ తాళంచెవి తనతోనే తీసుకువెడుతూ వుండీదట.

ఒకనాడు వాది అలా దాచుకువెళ్ళిన ఆ వస్తువులు, అవి పూర్తిగా తయారై ఆమె వొంటిమీద పెట్టుకోకుండానే, గదిలో వస్తువులు మాయమైపోయినాయి.

“ప్రతివాది సదరు వస్తువుల బంగారం ఖరీదు వాదికి ముదరా యివ్వవలసి వుంటుందా ?” అని ప్రశ్న.

హైకోర్టువారు ఉండదన్నారు. వస్తువులపెట్టి ప్రతివాది యింట్లోవుంచి వాది వెళ్ళిపోయినప్పటికిన్నీ, గదితాళం వాది తనతోనే పట్టుకువెళ్ళడంవల్లను, ప్రతివాది పూచీ వదలిపోయిన దని, ప్రతివాదికి సదరు బంగారం వాది స్వాధీనపఱచినట్టు ఎంచడానికి వల్లలేదనిన్నీ తీర్పుచెప్పినారు. కరగిన బంగారం ఆదిలో ఎప్పుడైతే వాదికి ప్రతివాది తిరిగి ఇచ్చివేసినాడో దానితో అతనికి మఱి బాధ్యత లేదన్నారు.

కాని కోర్టువారుమాత్రం వాదినిగుఱించి మిక్కిలి సాను తాపం వెల్లడించారు, "Much as I sympathise with the plaintiff" అనే శబ్దజాలంతో జడ్జిమెంటు ప్రారంభించినారు.

[ చూడుడు, 1938 ఎ. ఐ. ఆర్. మదరాసుపుట 32 ]

* * * * *

పై తీర్పు చదివి ఇంకా నేర్చుకుని గుర్తించవలసిన విశేషాలు.

1. ప్రతివాదిచేతిలో ఆశ్రితం సాయంత్రం ఆసగం సగం చేయబడ్డ వస్తువులు వాది ఉంచియుండవలసింది. ఎప్పుడో పాతవస్తువులు అతనికిచ్చి కరిగింపించానన్న యిదికొద్దీ అతని మీద ఋజువుభారం మోపడం చెల్లదు అన్నారు.

2. ప్రతివాదియింట్లో దొంగలుపడి ఎత్తుకు పోయినారని క్రిందికోర్టువారి సూచనవున్నా, ఆవాదనయొక్క నిజానిజాలు చర్చించడం అనవసరం అన్నారు.

[ చూడుడు, కంట్రాక్టు అక్టు సెక్షనులు 148, 149, 151, 152 ]

* * * * *

లా - లవర్ కామెంటు

సామాన్యజనుల వూహలెలావుంటాయి అంటే—పెట్టెలో వస్తువులుపెట్టి, పెట్టి ప్రతివాది యింటిలోని వొకగదిలో దాచుకు వెళ్ళినవెనుక, గదితాళం ఎవరు తీసుకువెళ్ళినా, గదిలో దొంగలు పడకుండా చూచేపూచీ ప్రతివాదిమీదనే వుంటుందనుకుంటారు పాపం! తనయొక్క యితరయింటి భాగంను, తన సామాన్నూ, తన వస్తువుల్నీ ఏలా కాపాడుకుంటూ వుంటాడో అలాగే ఆ గదినిన్నీ కాపాడుతూవుంటాడనే నమ్ముతారు. దొంగలుపడి ఎత్తుకుపోయినారన్నా, వస్తువులు పోయినాయిఅన్నా, ప్రతివాది పూచీ అంతమాత్రంచేత వదలిపోదని, అతడు తనయింట్లో తనకు తెలియకుండా, తనయొక్క జాగ్రతనుకూడా అతిక్రమించి, దొంగలుపడి ఎత్తుకుపోయినారని చూపించవలసి వుంటుందని ఊహిస్తారు. "గదితాళం తాళంగానేవున్నా గదికి బొక్కెట్టి వస్తువులెవళ్లో పట్టుకుపోయినా" రనడానికి వల్లా?

అయినా స్త్రీలు పరాయి యిళ్ళల్లో వస్తువులు చేయించు కోవడం ఏమిటి?

.... .... .... .... ....

## మరువాడ

రంగారావు కళాశాలావిద్యార్థి. పరీక్షలయి విశాఖపట్నం నుంచి తనూరు ప్రయాణ మౌతూ, మళ్ళీ యేంతోచిందో ఆవూరివాడే సహాధ్యాయి మఱో డుంటే, వాడికి తన సామానూఅదీ ఒప్పచెప్పి, "మా యింటికి